కృష్ణా జలాల ఒప్పందం.. ఆయకట్టు రైతులకు నష్టం..

- నీటి హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్‌ను ప్రశ్నించేందుకే మరో ఉద్యమం
- 'చలో నల్గొండ' సభకు తరలివెళ్లే సమావేశంలో జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

పెనుబల్లి: నల్గొండ వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వైరా రూరల్‌లో..

బోనకల్ : జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

మధిర/ బోనకల్లు/ చింతకాని/ ఎర్రుపాలెం/ కూసుమంచి, ఫిబ్రవరి 13 : కృష్ణా జలాలను కేఆర్ఎంబీకి అప్పటిస్తూ కాంగ్రెస్ చేసుకున్న ఒప్పందం నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు ఎంతో నష్టదాయకమని జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల నీటి హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు, నీటి హక్కుల కోసం పోరాడేందుకు బీఆర్ఎస్ సిద్ధమైందని తేల్చిచెప్పారు. ఇందుకోసమే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 'చలో నల్గొండ' సభను నిర్వహిస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరూ తరలివెళ్లి ఈ సభను జయప్రదం చేద్దామని పిలుపునిచ్చారు. కృష్ణా జలాల సాధన కోసం నల్గొండ సభకు వెళ్లే బీఆర్ఎస్ శ్రేణుల వాహనాలను మధిరలో మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృష్ణా జలాలను సాధించుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. కాగా, మధిర, పాలేరు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు కలిసి పెద్ద సంఖ్యలో బయలుదేరి బస్సులు, ప్రత్యేక వాహనాల్లో నల్గొండకు తరలి వెళ్లారు. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ పిలుపు మేరకు ఈ నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

సంద్ర ఆధ్వర్యంలో నల్గొండకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

కల్లూరు, ఫిబ్రవరి 13: కృష్ణా జలాల సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన ఛలో నల్గొండ కార్యక్రమానికి కల్లూరు, తల్లాడ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు బస్సులు, కార్లలో పెద్ద ఎత్తున తరలివెళ్లారు. కల్లూరు, సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు నుంచి బయలుదేరిన కార్లు, బస్సులను తల్లాడలో మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం కోసం అహర్నిశలూ శ్రమించి రాష్ట్రాన్ని సాధించి సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రం అభివృద్ధిలో నడిపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహనరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తుపల్లి..

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 13: పట్టణంలోని సిద్ధారం రోడ్‌లో లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్ నుంచి నల్గొండలో జరుగనున్న బహిరంగ సభ ర్యాలీని మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. సంద్ర వెంకటవీరయ్య సారథ్యంలో అధిక సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

పెనుబల్లి...

పెనుబల్లి, ఫిబ్రవరి13: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు నల్గొండ తరలివెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మందడపు అశోక్‌కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భూక్యా ప్రసాద్, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైరా..

వైరారూరల్, ఫిబ్రవరి 13: కృష్ణా జలాల పరిరక్షణ కోసం నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించిన బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్యే, వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి బానోత్ మదన్‌లాల్ ఆధ్వర్యంలో మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు.

ర్యాలీని ప్రారంభించిన ఖమ్మం మేయర్ నీరజ

ఖమ్మం, ఫిబ్రవరి 13 : నల్గొండలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభకు ఖమ్మం నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఖమ్మంలోని గట్టయ్యసెంటర్‌లో ఉన్న తెలంగాణ భవన్ నుంచి కార్యకర్తలు అధికసంఖ్యలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కార్లలో నల్గొండకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కార్ల ర్యాలీని నగర మేయర్ పునుకొల్లు నీరజ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేసేందుకు కేఆర్‌బీపీ అప్పగించిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా కేసీఆర్ చూశారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడునెలలు కూడా కాకముందే రైతులకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. నల్గొండకు తరలిన వారిలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, చిరుమామిళ్ల రవికిరణ్, డోకుపర్తి సుబ్బారావు, నాగండ్ల కోటేశ్వరరావు, మాటేటి నాగేశ్వరరావు, ఆళ్ల నిరీశ అంజిరెడ్డి, మేడారపు వెంకటేశ్వర్లు, ధనాల శ్రీకాంత్, పాలడుగు పాపారావు, పత్తిపాక రమేశ్, కన్నం ప్రసన్నకృష్ణ, జంగం భాస్కర్, జానీ, రామ్మోహన్, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బత్తుల మురళి, పైడిపల్లి సత్యనారాయణ, కొనగంచి ప్రసాద్, పొదిల నాగరాజు, కిషన్‌నాయక్, దేవభక్తిని కిషోర్, హరిప్రసాద్, మెంటెం రామారావు, ప్రదీప్, గుత్తా రవి, వీరూనాయక్, కుర్రా భాస్కర్‌రావు, తాతా వెంకటేశ్వర్లు, గొల్లపూడి హరికృష్ణ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నర్సింహారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి
కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 13 : ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వచ్చిన ఆయన ప్రిన్సిపాల్ చాంబర్‌లో వైద్యాధికారులు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరైన నేపథ్యంలో జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో సేవలు పెరగాలని సూచించారు. గతంలో 90మంది వైద్యులుండగా, ప్రస్తుతం 113 మంది, స్టాఫ్ నర్సులు 147మందికి తాజాగా 230మంది ఉన్నారని తెలిపారు. నెలకు వెయ్యి ప్రసవాలే లక్ష్యంగా వైద్యులు పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో రెండు టిప్పా పరీక్ష యంత్రాలు, ఐదుగురు రేడియాలజిస్ట్‌లు ఉన్నారని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేసుకుని స్కానింగ్, సిటీ స్కానింగ్ పరీక్షలు పెంచాలన్నారు. ప్రధాన ఆసుపత్రిలో ఎంఆర్ఐ, లాపరోస్కోపిక్ మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్, సర్జరీ తదితర విభాగాల్లో సాధించిన పురోగతిపై కలెక్టర్ ఆరా తీశారు. వైద్యులు అందుబాటులో ఉన్నారని, వసతులు కల్పిస్తున్నామని రోగులకు విస్తృతమైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్య కళాశాల అవసరాల దృష్ట్యా భవనాల నిర్మాణానికి స్థల సమస్యను తాము పరిష్కరిస్తామని అన్నారు. ప్రస్తుతం స్థల సమస్య ఉందని, ప్రస్తుతం తరగతులు జరుగుతున్న దృష్ట్యా భవన నిర్మాణాలు ఏకకాలంలో జరిగేలా చూడాలన్నారు. నర్సింగ్, పారా మెడికల్, ఫిజియోథెరపీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రానున్నదని భవిష్యత్ అవసరాల నిమిత్తం చర్యలు తీసుకోవాలని

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఆదేశించారు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం ల్యాబ్, లెక్చర్ హాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో రాములునాయక్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సైనిక సంక్షేమ భవన పనులు పూర్తిచేయాలి : కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 13 : జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సైనిక సంక్షేమ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సైనిక సంక్షేమ భవన నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవనంలో విద్యుత్, టైల్స్, కలరింగ్ పనులు చేయాల్సి ఉందని పనులు వేగంగా పూర్తిచేసేలా చూడాలని సూచించారు. ఇన్‌చార్జి జిల్లా సైనిక సంక్షేమాధికారి కొండపల్లి శ్రీరామ్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ డీఈఈ రాందాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి
డీఏవో విజయనిర్మల

రఘునాథపాలెం, ఫిబ్రవరి 13 : ఎరువులు, పురుగుమందుల డీలర్లు రైతులతో మమేకమై వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేలా కృషిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి యం.విజయనిర్మల పేర్కొన్నారు. మండల కేంద్రం రఘునాథపాలెం రైతువేదికలో మంగళవారం జిల్లాలోని 80మంది ఇన్పుట్ డీలర్లకు 48 వారాల దేశీ డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ఆమె పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. డీలర్లు చట్టపరిధిలో వ్యాపారం చేస్తూ లాభాలు పొందాలన్నారు. జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి అనసూయ, కేవీకే వైరా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కే రవికుమార్, డీఏవో శ్రీనివాసరెడ్డి, ఏడీహెచ్ రమణ, ఏడీఏలు శ్రీనివాసరావు, స్వరూపారాణి, సతీశ్, అరుణ, శరత్‌బాబు పాల్గొన్నారు.

టీటీ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులకు పతకాలు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 13 : గోవాలో జరిగిన జాతీయస్థాయి మాస్టర్ టేబుల్ టెన్నిస్ సింగిల్స్, డబుల్స్ పోటీల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ముప్పై ఏండ్లు దాటిన విభాగంలో ఉమ్మడి జిల్లాకు చెందిన యాకూబ్ అలీ, లోకేష్ ఇదుపుగంటి సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ సాధించారు. వారి విజయం పట్ల జిల్లా యువజ, క్రీడల అభివృద్ధి అధికారి టీ సునీల్‌రెడ్డి, జిల్లా టీటీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్, ట్రెజరర్ డాక్టర్ శశి కుమార్, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ యజమాని రవిమారుత్, అసోసియేషన్ ప్రతినిధులు ప్రేమ్‌కుమార్, థామస్, రియాజ్, రియాజ్ షేక్, చలపతి పరిటాల, మహబూబ్ అలీ, సాయిశివ రెడ్డి, కోచ్ సాంబమూర్తి హర్షం వ్యక్తం చేశారు. రెండు జిల్లాల పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేశారని కొనియాడారు.

మల్లు వెంకటేశ్వర్లుకు నివాళి

వైరారూరల్, ఫిబ్రవరి 13: రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోదరుడు మల్లు వెంకటేశ్వర్లు (70) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం హైదరాబాద్ గచ్చిగౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న మల్లు భట్టి, ఆయన కుటుంబ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. నాయకులు, గ్రామస్తుల సందర్శనార్థం కుటుంబ సభ్యులు వైరాలో వెంకటేశ్వర్లు నివాసంలో భౌతికకాయాన్ని ఉంచారు. బుధవారం ఉదయం 9 గంటలకు మృతుడు వెంకటేశ్వర్లు స్వగ్రామం వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో అంత్యక్రియలు నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.

500 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

గార్డెన్‌లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

కూసుమంచి, ఫిబ్రవరి 13: అక్రమంగా దాటిచెపెట్టిన రేషన్ బియ్యాన్ని సూర్యాపేట పోలీసులు పట్టుకున్న ఘటన కూసుమంచి మండలం గట్టుసింగారంలో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట పోలీసులు మంగళవారం వారి జిల్లాలో చేసిన తనిఖీల్లో అక్కడ పీడీఎస్ బియ్యం కొనుగోలు, విక్రయం చేసే వ్యాపారులు పట్టుబడ్డారు. వారు ఇచ్చిన సమాచారం ప్రకారం కూసుమంచి మండలానికి చేరుకున్న వారు గట్టుసింగారం వద్ద ఎస్ఆర్ఎస్పీ కాలువ సమీపంలోని ఓ గార్డెన్‌లో అక్రమంగా దాచిపెట్టిన 500 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. బియ్యంతో సంబంధం ఉన్న కూసుమంచి మండలానికి చెందిన ఐతగాని శ్రీను, నరేశ్, మంగ్యలను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, మూడు టాటా ఏస్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

చిన్నకోరుకొండిలో 45 క్వింటాళ్లు..

కల్లూరు, ఫిబ్రవరి 13: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్న ఘటన మండలంలోని చిన్నకోరుకొండిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఎస్సై షాకీర్ తెలిపిన వివరాలు.. చిన్నకోరుకొండిలో ఆటోలో గ్రామానికి చెందిన కాశిబోయిన వెంకటేశ్వర్లు, కురుకుల నర్సింహారావుతోపాటు మరో వ్యక్తి బియ్యం లోడ్ చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లినట్లు తెలిపారు. రవాణాకు సిద్ధంగా ఉన్న ట్రక్కు ఆటోను, 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామని తెలిపారు. రేషన్ బియ్యం శాంపిల్స్‌ను సివిల్ సప్లయ్ డీటీ సత్యనారాయణకు పంపగా వాటిని పీడీఎస్ బియ్యంగా నిర్ధారించడంతో వెంకటేశ్వర్లు, నర్సింహారావులను అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడన్నారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, బ్లూకోట్ కానిస్టేబుల్ సుందరం, కానిస్టేబుల్ ప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో 57 క్వింటాళ్లు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 13 : ప్రజా పంపిణీకి చెందిన బియ్యాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నాన్ని ఖానాపురం హవేలీ పోలీసులు అడ్డుకున్నారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ఏసీపీ ఆధ్వర్యంలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాడిచేసి 57 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఖమ్మం నగరం ఎస్‌బీఐటీ కాలేజీ వెనుకాల ఖాళీ స్థలంలో పీడీఎస్ బియ్యం లారీలో లోడ్ చేస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. ఖమ్మం నగరానికి చెందిన చల్లా గోపి, సంబోజు రాము, వత్సవాయికి చెందిన పల్లపు రాములు వీరు ముగ్గురు వినియోగదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి లారీకి లోడ్ చేసి 35క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను కాకినాడకు తరలించే ప్రయత్నంలో పట్టుకున్నట్లు తెలిపారు. అంతేకాక ఖమ్మం నగరం కొత్తగూడేనికి చెందిన ఒగ్గ వెంకటేశ్వరరావు తన ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం మేరకు దాడి చేయగా 22 క్వింటాళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాశ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లి, ఫిబ్రవరి 13: సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సత్తుపల్లి ఫస్ట్ ఫీడర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీనివాస థియేటర్ రోడ్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఏఈ శరత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విశ్వశాంతిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

సత్తుపల్లి, ఫిబ్రవరి 13: స్థానిక విశ్వశాంతి పాఠశాలలో మంగళవారం విద్యార్థులు కూచిపూడి నృత్యప్రదర్శనలు నిర్వహించారు. కళాకారుల వేదిక నిర్వాహకులు రంగపురి వెంకటేశ్వరరావు, సృజన, రామకృష్ణ మాట్లాడుతూ కృష్ణా జిల్లా కూచిపూడిలో ఆవిర్భవించి అనంతరం ప్రపంచ దేశాలకు వ్యాపించిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు, డ్యాన్స్ మాస్టర్ అనూష, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో రేజర్ల విద్యార్థిని ప్రతిభ

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 13: పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సత్తుపల్లి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో రేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పీ గాయత్రి ప్రథమ స్థానంలో నిలిచింది. గాయత్రిని హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయురాలు కమలకుమారి అభినందించారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు కీర్తన ఎంపిక

కల్లూరు, ఫిబ్రవరి 13: 2022-23 రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన దంతాల కీర్తన ఎంపికైందని హెచ్ ఎం ఎల్లారెడ్డి మంగళవారం తెలిపారు. కీర్తన రూపొందించిన ఇన్‌స్పైర్ ప్రాజెక్టు దమ్ము చేసేటప్పుడు ట్రాక్టర్ ప్రమాదాల నివారణ పరికరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. కీర్తనను హెచ్ఎం, ప్రాజెక్టు గైడ్ టీచర్ నాగేశ్వరరావు అభినందించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 13: మండలంలోని రేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం యువ సేవాసమితి, కిష్టారం ఇన్‌చార్జి తీగవరపు కేశవరెడ్డి ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు మాజీ సర్పంచ్ జక్కుల ప్రభాకర్ పరీక్షా ప్యాడ్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, యువసేవాసమితి వ్యవస్థాపకులు జొన్నలగడ్డ రాజు, పసుమర్తి శ్యామ్, మల్లెల వెంకీ, శ్రీనివాస్, తేజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిర, వైరా, నేలకొండపల్లి మార్కెట్ కమిటీలు రద్దు

ఖమ్మం, ఫిబ్రవరి 13 : ఖమ్మం జిల్లాలోని వైరా, మధిర, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియామకమైన వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయా మార్కెట్ కమిటీల చైర్మన్, వైస్ చైర్మన్‌ల పదువులు రద్దయ్యాయి. వారితోపాటు మార్కెట్ కమిటీల పాలకమండలి మొత్తం రద్దయినట్టయింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
కావలెను
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభా పాటవ పరీక్ష

పెనుబల్లి, ఫిబ్రవరి 13: పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభ పాటవ పరీక్ష-2024 నిర్వహించారు. లంకపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన రాయల ఉదయభార్గవ్ మణికంఠ ప్రథమ, తాళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ముచ్చర్ల యశస్విని ద్వితీయ, లంకపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి భీమిని జ్యోత్స్న తృతీయ బహుమతి సాధించారు. వీరు ఈ నెల 18న జరిగే జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పరీక్షకు అర్హత సాధించారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా వీవీ రామారావు ఇన్‌చార్జి హెచ్ఎం జడ్పీహెచ్ఎస్ వీఎం బంజర, కోకన్వీనర్‌గా కే మోహన్‌రావు వ్యవహరించారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత...ప్రతిఒక్కరి బాధ్యత

కల్లూరు, ఫిబ్రవరి 13: రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతిఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి ఎంవీఐ వెంకటపుల్లయ్య అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మంగళవారం కల్లూరు ప్రధాన సెంటర్‌లో గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాల్లో విధిగా పత్రాలు కలిగి ఉండాలన్నారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాలపై కళాజాత నిర్వహించారు.

క్విజ్ పోటీల్లో రేజర్ల జడ్పీహెచ్ఎస్‌కు ప్రథమస్థానం

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 13: సాంఘీక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని రేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ, సదాశివునిపాలెం జడ్పీహెచ్ఎస్ ద్వితీయ, సత్తుపల్లి బాలికోన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

చింతకాని/ ఎర్రుపాలెం, ఫిబ్రవరి 13: చింతకాని, ఎర్రుపాలెం మండలాల్లో నూతన ఎంపీడీవోలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వచ్చిన రామయ్య చింతకాని ఎంపీడీవోగా, జనగామ జిల్లా నుంచి వచ్చిన బీ.సురేందర్ ఎర్రుపాలెం ఎంపీడీవోగా చార్జ్ తీసుకున్నారు. ఎర్రుపాలెం ఎంపీడీవోగా పనిచేస్తున్న బీ.శ్రీనివాసరావు బయ్యారం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు.

ఎర్రుపాలెం ఎస్సైగా వెంకటేశ్

ఎర్రుపాలెం ఎస్సైగా పీ.వెంకటేశ్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఎం.సురేశ్ ఖమ్మానికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

చింతకాని ఎస్సై రాజేందర్ బదిలీ

చింతకాని ఎస్సై ఆలకుంట రాజేందర్ ఖమ్మం వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఖమ్మం వీఆర్‌లో ఉన్న షేక్ నాగుల్‌మీరా చింతకాని ఎస్సైగా రానున్నారు.

మిర్చి పంటలు పరిశీలించిన డీఏవో

ముదిగొండ, ఫిబ్రవరి 13: మండలంలో అమ్మపేటలో మిర్చితోపాటు ఇతర పంటలను స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి డీఏవో విజయనిర్మల మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటలకు ఆశించిన చీడపీడల రక్షణ కోసం రైతులు సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారులు రమణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాధ పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 13 : డ్రాగన్ ఫ్రూట్ సాగుతో అధిక లాభాలు చేకూరుతాయని జ